నాడు-నేడు పనుల పరిశీలన

ప్రజాశక్తి-పాలకొండ

మనబడి నాడు- నేడు పనుల పరిశీలన నిమిత్తం జూనియర్ కళాశాలలను స్థానిక సబ్‌కలెక్టర్ నూరుల్ కమర్ గురువారం సందర్శించారు. రెండు కళాశాలలో జరుగుతున్న నాడు-నేడు పనులను పరిశీలించారు. విద్యార్థులకు మెరుగైన శుద్ధ జలాన్ని అందించడానికి ఉద్దేశించి ఐదు లక్షలతో కొనుగోలు చేసిన ఆర్ఒ ప్లాంట్ త్వరలో వినియోగంలోకి తేవాలని ఆదేశించారు. ఇంతవరకు పబ్లిక్ పరీక్షల నిర్వహణలో ఉన్న కారణంగా ఆర్ఒ ప్లాంట్ బిగించలేదని ప్రిన్సిపల్ తెలియజేశారు. త్వరలోనే వాటి పనులు పూర్తి చేస్తామని చెప్పారు. పనులు జరుగుతున్న తీరును చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఇదే సందర్భంగా కళాశాల స్థల ఆక్రమణల వివరాలను ఇరువురు ప్రిన్సిపల్స్‌ను అడిగి తెలుసుకున్నారు. సబ్ కలెక్టర్ వెంట తహశీల్దార్ సోమేశ్వరరావు, మండల సర్వేయర్, ప్రిన్సిపల్ కుమార్ స్వామి, సత్యనారాయణ, ఎన్ఎస్ఎస్ పిఒ వి.అప్పారావు ఉన్నారు.

విద్యాశాఖ మంత్రి ఇలాకాలో అట్టడుగు స్థానం

ప్రభుత్వ కళాశాలల్లో తగ్గిన ఇంటర్ ఫలితాలు

విజయనగరంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల



ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విద్యాశాఖామంత్రి బొత్స సత్యనారాయణ ఇలాకాలో ఇంటర్ ఫలితాల్లో జిల్లా అట్టడగు స్థానంలో ఉంది. గత ఏడాదితో పోలిస్తే ఫలితాల శాతంలో కొద్దిపాటి మెరుగుదల తప్ప రాష్ట్రం మొత్తంగా చూసు కుంటే అత్యల్ప ఫలితాలు వచ్చాయి. ఈ ఏడాది 10 ఎపి సాంఘిక సంక్షేమ గురుకులాల నుంచి 626 మంది పరీక్షకు హాజరు కాగా 250 మంది ఉత్తీర్ణులై 39.90 శాతం ఫలితాలు నమోదు చేశారు. గత ఏడాది ఇవే విద్యా సంస్థలు 61.35 శాతం ఫలితాలు సాధించాయి. 6 గిరిజన సంక్షేమ గురుకుల కళాశాలల నుంచి 696 మందికి 451 ఉత్తీర్ణులై 64.80 శాతం నమోదు చేయగా గత ఏడాది 79.94 శాతం సాధించారు. 83 ప్రైవేటు విద్యా సంస్థల నుంచి 12150 మంది విద్యార్థులు హాజరు కాగా 6924 మంది ఉత్తీర్ణులై 56.99 శాతం ఉత్తీర్ణత సాధించారు. గత ఏడాది 52.88 శాతం ఫలితాలు వచ్చాయి. ఏడాది ప్రైవేటు విద్యా సంస్థలలో ఫలితాలు 4శాతం పెరిగాయి. జిల్లాలోని 23 కెజిబివిల నుంచి 717 మంది పరీక్ష రాయగా వారిలో 344 మంది ఉత్తీర్ణులయ్యారు. ఈ ఏడాది 47.98 ఫలితాలు రాగా, గత ఏడాది 55.43 శాతం ఫలితాలు వచ్చాయి. 16 మోడల్ స్కూల్స్ నుంచి 1179 మందికి 705 మంది ఉత్తీర్ణులయ్యారు. గత ఏడాది కంటే 6.50 శాతం వెనుకపడ్డాయి. 24 ప్రభుత్వ జూనియర్ కళాశాల ల నుంచి 3162 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 950 మంది ఉత్తీర్ణులై 30.01 శాతం ఫలితాలు నమోదు చేశారు. గత ఏడాది ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 31.78 శాతం ఫలితాలు నమోదు కావడం జరిగింది. గతంలో 100 శాతం ఫలితాలు సాధించిన కెజిబివిలు, మోడల్ స్కూళ్లు ఈ ఏడాది లేకపోవడం గమనార్హం.

100 శాతం సిలబస్ ప్రభావం

తొలుత 75 శాతం సిలబస్ ఆధారంగానే పరీక్షలు ఉంటాయని, చివరిలో 100 శాతం సిలబస్ ఆధారంగానే పరీక్షలు ఉంటాయని పేర్కొనడం వల్ల ఫలితాలపై ప్రభావం కనిపించింది. ప్రశ్నా పత్రాలు కూడా కఠినంగా ఇవ్వడం వలన ఫలితాలపై ప్రభావం చూపించింది. గత ఏడాది కంటే ఫలితాలు శాతంలో పెరిగింది

- ఎం.సత్యనారాయణ, ఆర్ఐఒ

బ్రిజ్‌భూషణ్‌ను అరెస్టు చేయాల్సిందే

ఐద్వా, ప్రజా సంఘాల ఆధ్వర్యాన నిరసన

నిరసన తెలుపుతున్న ఐద్వా, ప్రజా సంఘాల నాయకులు

ప్రజాశక్తి-కలెక్టరేట్

రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన బిజెపి ఎంపి బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌ను అరెస్ట్ చేయాలని గురువారం పట్టణంలోని చర్చి సెంటర్‌లో సిఐటియు, రైతు సంఘం, వ్యకాస, ఐద్వా, డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె.సుబ్బరావమ్మ మాట్లాడుతూ మహిళలకు రక్షణ కల్పించాల్సిన ప్రజాప్రతినిధులే వేధించడం దుర్మార్గమన్నారు. బిజెపి ప్రభుత్వం చెప్పేదొకటి, చేసేదొకటి అని విమర్శించారు. బిజెపి పాలిత రాష్ట్రాల్లో దళితులకు, మహిళలకు రక్షణ కరువైందని ఆవేదన వ్యక్తం చేశారు. లైంగికంగా వేధించిన ఎమ్‌పిని అరెస్ట్ చేయాలని ఒక బాలిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినా అరెస్టు చేయకపోవడం బాధాకరమని తెలిపారు. తక్షణమే ఆయన్ను ఎమ్‌పి పదవి నుంచి తప్పించాలని డిమాండ్‌చేశారు.

ఐద్వా జిల్లా కార్యదర్శి రెడ్డి శ్రీదేవి మాట్లాడుతూ నాలుగు రోజులుగా ఆందోళన చేస్తున్నా బిజెపి ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమని తెలిపారు. కుస్తీ పోటీల్లో ప్రతిభ కనబరిచే వారిని ప్రోత్సహించాల్సిన ఎమ్‌పి వింతగా ప్రవర్తించడం సరైంది కాదన్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మథరావు, జిల్లానాయకులు గొర్లి వెంకటరమణ, కొల్లి సాంబమూర్తి, రైతు సంఘం నాయకులు బంటు దాసు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పి.రాజశేఖర్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ప్రకాశం. బంకుర్ సూరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

దీక్షకు, సహనానికి ప్రతిరూపం భగీరథుడు

భగీరథ మహర్షి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అధికారులు

ప్రజాశక్తి-కలెక్టరేట్

దీక్షకు, సహనానికి ప్రతిరూపం భగీరథుడని జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ, సాధికారత అధికారి ఎస్.కృష్ణ తెలిపారు. భగీరథ మహర్షి ఉత్సవాలను గురువారం వెనుకబడిన తరగతుల సంక్షేమ, సాధికారత కార్యాలయంలో నిర్వహిం చారు. భగీరథ మహర్షి చిత్రపటానికి ఆయన పూలమాలవేసి, జ్యోతిప్రజ్వలన చేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భగీరథుడు ఎంత కష్టమైనా లెక్కచేయకుండా, అనుకున్నది సాధించారని తెలిపారు. భగీరథుని స్ఫూర్తిగా తీసుకొని ప్రతిఒక్కరూ జీవితంలో లక్ష్యాన్ని చేరుకొనుటకు ప్రయత్నం చేయాలని కోరారు. అపజయాలకు భయపడకుండా ప్రయత్నం చేయాలని, కష్టపడితే తప్పకుండా ఫలితం వస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సహాయ వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి ఎస్.సాంబయ్య, సూపరిం టెండెంట్ పి.సన్యాసి రావు, హాస్టల్ వెల్ఫేర్ అధికారులు పి.చిన్నారావు, ఎస్.నాగేశ్వరరావు, ఎన్.శ్రీనివాసరావు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

సంస్కరణలన్నీ కార్పొరేట్ల కోసమే

ప్రచారభేరిలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె.సుబ్బరావమ్మ

ర్యాలీ చేపడుతున్న వామపక్ష నాయకులు, కార్యకర్తలు

ప్రజాశక్తి-కలెక్టరేట్

మోడీ ప్రభుత్వం ప్రజల ప్రయోజనం కోసం ఎటువంటి సంస్కరణలు తీసుకురావడం లేదని, కేవలం కార్పొరేట్ల కోసమే పనిచేస్తుందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.సబ్బరావమ్మ ఆగ్రహం వ్యక్తంచేశారు. సిపిఐ, సిపిఎం ప్రచారభేరి కార్యక్రమంలో భాగంగా గురువారం పార్వతీపురం ఆర్‌టిసి కాంప్లెక్స్ నుండి మెయిన్ రోడ్డు మీదుగా గిరిజన సామాజిక భవనం వరకు ర్యాలీ చేపట్టారు. అనంతరం ఏర్పాటుచేసిన సభలో సబ్బరావమ్మ మాట్లాడారు. మోడీ అధికారంలోకి వచ్చినప్పటి నుండి నిత్యావసర సరుకుల ధరలు అమాంతంగా పెరిగిపోయాయిని చెప్పారు. ప్రజల ఆదాయం మాత్రం పెరగకపోగా , నిత్యం పెరిగే పన్నుల భారంతో ప్రజలంతా ఆర్థిక సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని తెలిపారు. ప్రజాభివృద్ధి కార్యాచరణ రూపకల్పన చేయకపోగా ప్రజల మధ్య కులాలు, మతాల పేర్లతో చిచ్చు పెడుతున్నారని విమర్శించారు. వామపక్షాలు ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న ఉపాధి హామీ చట్టాన్ని కూడా నిర్వీర్యం చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని మండిపడ్డారు. ఇప్పటికే ఉపాధి హామీ కూలీలకు ప్రతిరోజూ రెండు పూటలా పనికి రావాలని నిబంధన అమలు చేస్తున్నారని తెలిపారు. రెండు పూటలా పనిచేసినప్పటికీ కనీస వేతనం కూడా రాని పరిస్థితి ఏర్పడిందన్నారు. కనీసం వేసవిలో అలవెన్సులు కూడా ఇవ్వడం లేదని చెప్పారు. పనిచేసే చోట తాగునీరు, టెంట్లు ఏర్పాటుకు కూడా ఎటువంటి ఆర్థిక ప్రోత్సాహం లేదని తెలిపారు. ఇవన్నీ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసే ఎత్తుగడలో భాగమేనని ఆమె తెలియజేశారు. మోడీ ప్రభుత్వం ప్రజల ఆస్తులని కార్పొరేట్లకు ఉదారంగా ధారాదత్తం చేయడం తప్ప పేద, బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి కోసం ఎటువంటి సంస్కరణలు నేటి వరకు చేశారో చెప్పలేని దీనస్థితిలో ఉందన్నారు. మోడీ ప్రభుత్వం బ్యాంకులను, ప్రభుత్వ రంగ సంస్థలను చివరకు ఎల్ఐసిని కూడా ప్రైవేటుపరం చేసి ఎంతో విలువైన ప్రజాధనాన్ని పెట్టుబడిదారులకు కారుచౌకగా అమ్మేస్తోందని ధ్వజమెత్తారు. ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రశ్నించిన వారిపై ఇడి దాడులు జరిపిస్తోందని విమర్శించారు. విశాఖ స్టీల్ ప్లాంట్ కోసం ఎంతో మంది వామపక్ష నాయకులు పోరాడారని, స్టీల్ ప్లాంట్‌లో సుమారు 40 వేల మంది ఉద్యోగులు పనిచేస్తున్నారని తెలిపారు. దీనివల్ల వ్యాపార, వాణిజ్యాలు సక్రమంగా జరిగి సుమారు రెండు లక్షల మందికి ఉపాధి దొరుకుతుందన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేట్ పరం చేస్తే ఎంతోమంది ఉపాధిని కోల్పోయే పరిస్థితి ఏర్పడుతుందని అన్నారు.

సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక హక్కులను హరిస్తోందన్నారు. మోడీ పాలనలో వ్యవసాయానికి ఎటువంటి ప్రోత్సాహమూ లేదని చెప్పారు. ఇప్పటికే చాలామంది రైతులు వ్యవసాయం పట్ల విరక్తి చెంది వలసబాట పడుతున్నారని తెలిపారు. సిపిఐ జిల్లా కార్యదర్శి కోరంగి మన్మథరావు మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతూ వామపక్షాలు చేపట్టే పోరాటంలో కలిసిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో వామపక్ష నాయకులు సూరయ్య, టి.జీవ, కె.గోపి, బంటు దాసు, రెడ్డి శ్రీదేవి, కె.సాంబమూర్తి, వై.మన్మథరావు, బిటి నాయుడు, బి.సూరిబాబు, వెంకట్రావు, బివి రమణ, రవీంద్ర, పాకల సన్యాసిరావు, తదితరులు పాల్గొన్నారు.

రైల్వే నిర్వాసితుల వినతి

రైల్వే మూడోలైన్ విస్తరణలో భాగంగా నివాసాలు కోల్పోయిన తమకు న్యాయం చేయాలని విజయరామరాజు కాలనీ నిర్వాసితులు.. సిపిఎం నాయకులు కె.సుబ్బరావమ్మకు వినతి అందజేశారు. మూడోలైన్ పనుల వల్ల సుమారు 80 కుటుంబాలు తమ ఇళ్లను కోల్పోయాయని, అందరికీ పునరావాసం కల్పించాలని కోరారు. సుబ్బరావమ్మ స్పందిస్తూ రైల్వే విస్తరణ పనుల్లో ఆవాసం కోల్పోయిన కుటుంబాల అందరికీ న్యాయం జరిగే వరకూ సిపిఎం పోరాడుతుందని హామీ ఇచ్చారు.

సిపిఎం నాయకులకు వినతి అందిస్తున్న రైల్వే మూడో లైన్ నిర్వాసితులు

వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్ నిశాంత్, జెసి విష్ణుచరణ్, డిఆర్ఒ వెంకటరావు

65 శాతం స్టోన్ ప్లాంటేషన్ పూర్తి

ప్రజాశక్తి-కలెక్టరేట్

మొదటి విడత రీసర్వే పూర్తయిన గ్రామాలలో 65 శాతం స్టోన్ ప్లాంటేషను పూర్తయినట్లు కలెక్టరు నిశాంత్ కుమార్ తెలిపారు. పనుల పురోగతిపై రోజువారీ సమీక్ష నిర్వహిస్తున్నట్టు చెప్పారు. గురువారం సిసిఎల్ఎ చీఫ్ కమిషనరు జి.సాయిప్రసాద్, సర్వేశాఖ కమిషనరు సిద్ధార్థ జైన్.. జిల్లా కలెక్టర్లు, జాయింటు కలెక్టర్లతో రీసర్వేపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిసిఎల్ఎ చీఫ్ కమిషనరు జి.సాయి ప్రసాద్ మాట్లాడుతూ రీసర్వేలో పూర్తయిన గ్రామాల్లో భూహక్కు పత్రాలలో తప్పులు, ఫొటో మిస్సింగ్ ఉంటే వాటి వివరాలు పంపించాలన్నారు. సర్వే పూర్తయిన భూములకు మ్యాపులను ప్రింటింగ్ కోసం సర్వే శాఖకు పంపించాలని తెలిపారు. ప్రింటింగ్ పూర్తిచేసి వచ్చిన భూహక్కు పత్రాలను పంపిణీ పూర్తిచేయాలని, స్టోన్ ప్లాంటేషను పూర్తిచేయాలని చెప్పారు. రీసర్వేకు సంబంధించి మ్యుటేషన్లు, ప్లాంటేషను తదితర అంశాలపై రోజువారీ నివేదికలు పంపించాలన్నారు. స్పందనకు సంబంధించిన అర్జీలను సకాలంలో పరిష్కరించాలని, అర్జీల పరిష్కారంపై రోజువారీ సమీక్షలు నిర్వహించాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి జాయింటు కలెక్టరు సి.విష్ణుచరణ్, జిల్లా రెవిన్యూ అధికారి జె.వెంకటరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు ప్రారంభించాలి

ప్రజాశక్తి-కలెక్టరేట్

రబీ ధాన్యం కొనుగోలుకు కేంద్రాలను ఏర్పాటు చేయాలని ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి బి.అప్పలనాయుడు ఆధ్వర్యాన గురువారం సివిల్ సప్లై మేనేజర్, డిఎస్ఒకు వినతులు అందించార్లు, మేనేజర్ స్పందించి తక్షణమే ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సంఘం జిల్లా నాయకులు చందక కేశవరావు, వి.సత్యనారాయణ, పి.రామినాయుడు పాల్గొన్నారు.

తండ్రికి అంత్యక్రియలు నిర్వహిస్తున్న కుమార్తె కళ

తండ్రి చితికి కుమార్తె తలకొరివి

ప్రజాశక్తి - కురుపాం

కన్నందుకు కడసారిగా తండ్రికి తలకొరివి పెట్టి రుణం తీర్చుకుంది ఓ కుమార్తె. ఈ సంఘటన గురువారం మండల కేంద్రమైన కురుపాంలోని శివన్నపేటలో చోటుచేసుకుంది. శివన్నపేటకు చెందిన పెదపెంకి వెంకటరమణ (80) అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం మృతి చెందారు. ఆయనకు ఇద్దరు ఆడపిల్లలే. గురువారం నిర్వహించిన అంత్యక్రియలను చిన్న కుమార్తె కళ నిర్వహించింది. వెంకటరమణ దశాబ్దాలుగా తక్కువ ఫీజులు తీసుకొని ప్రైవేటు చెబుతూ, ఎంతోమంది విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించారు.

జంపరకోట పనులపై పిఒ ఆరా

పూర్తిస్థాయి నివేదిక ఇవ్వాలని అధికారులకు ఆదేశాలు • ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి-పాలకొండ, పాలకొండ రూరల్

ఇటీవల 'ప్రజాశక్తి' దినపత్రికలో జంపరకోటకు మోక్షమెప్పుడో అనే వార్త ప్రచురించడంతో అధికారుల్లో కదలిక వచ్చింది. కలెక్టర్ నిశాంత్‌కుమార్ దీనిపై దృష్టిపెట్టి సీతంపేట ఐటిడిఎ పిఒ కల్పనకుమారికి ఆదేశాలు జారీ చేశారు. దాంతో ఆమె గురువారం మండలంలో జంపరకోట గ్రామాన్ని సందర్శించి జలాశయాన్ని పరిశీలించారు. పూర్తిగా సమగ్రమైన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎప్పుడు ప్రారంభమైంది, ఎంతవరకు పనులు జరిగాయి, ఎంత ఖర్చుచేశారన్న వివరాలను సేకరించారు. ఈ జలాశయం పూర్తయితే ఎన్ని ఎకరాలకు సాగునీరు అందుతుంది, ఏయే గ్రామాలు ఈ పరిధిలో ఉన్నాయన్న వివరాలను కూడా అడిగి తెలుసుకున్నారు. సమగ్ర వివరాలను నివేదిక రూపంలో తయారు చేసి తనకు అందజేయాలన్నారు. ఇందులో అన్ని అంశాలు పొందుపర్చాలని చెప్పారు. ఈ నివేదికను జిల్లా కలెక్టర్‌కు సమర్పిస్తామన్నారు. ఈమె వెంట సబ్‌కలెక్టర్ నూరుల్ కమర్, తహశీల్దార్ పి.సోమేశ్వరరావు, ఎంపిడిఒ డొంక త్రినాథులు, ఇంజినీరింగ్ అధికారులు ఉన్నారు.

జంపరకోట జలాశయాన్ని పరిశీలిస్తున్న పిఒ, సబ్ కలెక్టర్

కేంద్రమంటే అంత భయమా? : లోక్‌సత్తా

ప్రజాశక్తి-సాలూరు

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వమంటే జగన్ సర్కారుకు ఎంత భయమో ఇటీవల పరిణామాలను బట్టి అర్థమవుతోందని లోక్ సత్తా రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు భీసెట్టి బాబ్జీ అన్నారు. గురువారం స్థానిక సంగీత పాఠశాల వీధి జంక్షన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 55 ఏళ్లుగా నలుగుతున్న కొటియా గ్రామాల వివాదంపై ఒడిశాకి చెందిన కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఇటీవల చేసిన వ్యాఖ్యలు తీవ్ర అభ్యంతరకరమని చెప్పారు. కనీసం తన స్పందన తెలియజేసే పరిస్థితిలో సిఎం జగన్ మోహన్ రెడ్డి లేకపోవడం ఆశ్చర్యానికి గురి చేస్తోందని చెప్పారు. తన రాజకీయ అవసరాల కోసం కొటియా గ్రామాల ప్రయోజనాలను పణంగా పెట్టడం తగదన్నారు. గిరిజనులంతా 'నువ్వే మా నమ్మకం', 'జగనన్నే మా భవిష్యత్తు' అని అంటున్నా.. సిఎం జగన్ వారికి భరోసా ఇవ్వలేక పోతున్నారని అన్నారు. విధి నిర్వహణలో భాగంగా కొటియా గ్రామాల్లో ఒకటైన పట్టు చెన్నూరులో ఉన్న ఆంధ్రా సిఐ రోహిణి పతిని, సిబ్బందిని కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ 'గో బ్యాక్' అంటూ వ్యాఖ్యానించడం సుప్రీం కోర్టు తీర్పు ఉల్లంఘన కిందకు వస్తుందని చెప్పారు. ఆయనపై 153ఎ, 153బి, ఐపిసి 353 సెక్షన్ల కింద కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. అపారమైన ఖనిజ సంపద ఉన్న కొటియా గ్రామాల పై ఎపి ప్రభుత్వం వైఖరి ఏమిటో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాతృభూమి సేవా సంఘం కార్యదర్శి ఇప్పల గోపి, కేన్సర్ సాధన సమితి జిల్లా అధ్యక్షుడు పి.నరేష్ పాల్గొన్నారు.

చెత్త సేకరణ పర్యవేక్షణ

ప్రజాశక్తి-పాలకొండ

పట్టణంలో గురువారం నగర పంచాయతీ కమిషనర్ ఎస్.సర్వేశ్వరరావు చెత్త సేకరణ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ప్రధాన రహదారితో పాటు పలు వీధుల్లో పర్యటించి చెత్త పేరుకు పోయిన ప్రాంతాల్లో వెంటనే తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు. మూడు బిన్నుల విధానాన్ని ప్రతి ఇంటివద్ద క్రమం తప్పకుండా అమలు చేయాలన్నారు. ఓపెన్ కాలువల్లో ప్రతిరోజూ స్ప్రేయింగ్ చేపట్టాలని సిబ్బందికి ఆదేశించారు. రోడ్లపై చెత్త వేయకుండా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది ఉన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

ప్రజాశక్తి-సీతానగరం

మండలంలోని జోగింపేట, గుచ్చిమి గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను గురువారం ఎంపిడిఒ ఎంఎస్ఎన్ఎల్ ప్రసాద్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేతనదారులు సకాలంలో సమయానికి వచ్చి నిర్దేశించిన ప్రదేశాల్లో పనిచేయాలన్నారు. వడదెబ్బ తగలకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం మస్తర్లు పరిశీలించారు. ఆయనతోపాటు ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయాల సందర్శన

పెదబొగిలిలోని సచివాలయాలను ఎంపిడిఒ ఎంఎస్ఎల్ఎన్ ప్రసాద్ గురువారం సందర్శి ంచారు. ప్రతిరోజూ సచివాలయ సిబ్బంది సాయంత్రం మూడు నుంచి ఐదు గంటల వరకు సచివాలయంలో స్పందన కార్యక్రమాలు నిర్వహించా లన్నారు. సచివాలయ సిబ్బంది కచ్చితంగా యూనిఫాం ధరించాలని సూచించారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి కెకె వర్మ ఉన్నారు.

మేడేను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-పాలకొండ రూరల్

మేడే జయప్రదం చేయాలని సిఐటియు మండల కమిటీ ఆధ్వర్యంలో గురువారం పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు మాట్లాడుతూ మేడేను కార్మిక హక్కుల దినోత్సవంగా జరుపుకోవాలని సూచించారు. వారోత్సవాలు నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్షులు బి.అమరవేణి, కార్యదర్శి కాద రాము, జిల్లా కమిటీ సభ్యులు ఎ.లక్ష్మణరావు, వివిధ యూనియన్ల నాయకులు కె.గౌరీశ్వరి, చిట్టమ్మ, జి.జెస్సిబాయ్, మజ్జి వీరంనాయుడు, ఉపాధ్యక్షులు టి.శ్రీరాములు, ఎడ్ల శ్రీనివాసరావు, చింతల సంజీవి పాల్గొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిఐటియు, పలు సంఘాల నాయకులు

వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న డిఐఒ జగన్మోహనరావు

ఆశ్రమ పాఠశాలను సందర్శించిన డిఐఒ

ప్రజాశక్తి-పార్వతీపురం రూరల్

రావికోన ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలను గురువారం జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి టి.జగన్మోహనరావు సందర్శించారు. ఆయన ప్రధానోపాధ్యాయులు, వార్డెన్, వైద్య సిబ్బందితో సమీక్షించారు. గతంలో విద్యార్థులకు ఎటువంటి అనారోగ్య లక్షణాలు వచ్చాయి, సంబంధిత ఆరోగ్య వివరాలు, రికార్డులు, హిమోగ్లోబిన్, రక్త పరీక్షల రికార్డులు పరిశీలించారు. రక్త హీనతగా గుర్తించిన విద్యార్థులకు ఎటువంటి చర్యలు చేపట్టారనే అంశాలపై ఆరా తీశారు. అనంతరం ఆయన విద్యార్థులతో మాట్లాడి ఆరోగ్య పరిశీలన చేశారు. అనారోగ్య లక్షణాలు గుర్తించిన విద్యార్థులకు వైద్య సిబ్బందిచే పరీక్షలు చేయించి , మందులు అందజేశారు. విద్యార్థులకు రక్త హీనత, సీజనల్ వ్యాధులు, వ్యక్తిగత పరిశుభ్రత, పౌష్టికాహారం ఆవశ్యకత, రోగ నిరోధక శక్తి అనే అంశాలపై ఆరోగ్య అవగాహన కల్పించారు. మలేరియా, డెంగీ తదితర జ్వరాల లక్షణాలను విద్యార్థులకు డిఐఒ జగన్మోహనరావు వివరించి ఆరోగ్యం పరంగా ఎటువంటి ఇబ్బందులు కలిగినా వెంటనే తెలియజేయాలని సూచించారు. విద్యార్థులకు ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు అందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కె.సింగన్నదొర, సూపర్వైజర్ జయగౌడ్, హాస్టల్ వార్డెన్ సింహాచలం నాయుడు, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నేడు నగర పంచాయతీ సాధారణ సమావేశం

ప్రజాశక్తి-పాలకొండ

నగర పంచాయతీ సాధారణ సమావేశాన్ని శుక్రవారం ఉదయం 10.30 గంటలకు నిర్వహిస్తున్నట్టు కమిషనర్ ఎస్.సర్వేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. చైర్పర్సన్ యందవ రాధాకుమారి అధ్యక్షతన ఈ సమావేశం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. సభ్యులందరూ హాజరుకావాలని కోరారు.

ఉపాధి హామీ పనులను పరిశీలిస్తున్న ఎంపిడిఒ త్రినాథులు

ఉపాధి పనుల పరిశీలన

ప్రజాశక్తి-పాలకొండ రూరల్

మండలంలోని నవగాం గ్రామంలో వీరసాగరం చెరువులో చేపడుతున్న ఉపాధి పనులను ఎంపిడిఒ డొంక త్రినాథులు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొలతల ప్రకారం పనులు చేపట్టి గిట్టుబాటు కూలీ పొందాలన్నారు. సమయ పాలన పాటించి పనులు చేపట్టాలన్నారు. ఎటువంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకురావాలన్నారు.

సక్రమంగా రికార్డుల నిర్వహణ

ప్రజాశక్తి పార్వతీపురం రూరల్

ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు రికార్డులను సక్రమంగా నిర్వహించాలని, పాఠ్యపుస్తకాల పంపిణీ సక్రమంగా చేపట్టాలని డిఇఒ వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం మండలంలోని పెదబొండపల్లి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. పాఠ్య పుస్తకాలు, డైరీలు చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. పరీక్షల నిర్వహణను పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్ఎం గౌరి, సూర్యనారాయణ, ఈశ్వర రావు, శ్రీనివాసరావు, సిఆర్పి దీప్తి రాణి, శంకర రావు పాల్గొన్నారు.

కాలువలో పూడికలు తొలగింపు

'ప్రజాశక్తి' వార్తకు స్పందన

ప్రజాశక్తి-వీరఘట్టం

మండల కేంద్రంలోని మర్రివీధిలో కాలువల్లో గురువారం పూడికలు తొలగించారు. 'బురదమయంగా మారిన మర్రివీధి' శీర్షికతో ప్రజాశక్తిలో వచ్చిన కథనానికి మేజర్ పంచాయతీ అధికారి స్పందించి కాలువలో పూడికలు తొలగించారు. దీంతో స్థానికులు ప్రజాశక్తికి కృతజ్ఞతలు తెలిపారు.

పూడికలను తొలగిస్తున్న కార్మికుడు

సక్రమంగా పివిటిజి సర్వే

ప్రజాశక్తి-వీరఘట్టం

సచివాలయాల పరిధిలోని పివిటిజి సర్వే సక్రమంగా నిర్వహించాలని ఎంపిడిఒ వై.వెంకటరమణ సిబ్బందిని ఆదేశించారు. గురువారం మండలంలోని చిన్నగోరకాలనీ సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేపట్టారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా సర్వే పూర్తి కచ్చితమైన డేటాను సమర్పించాలని ఆదేశించారు. అనంతరం సచివాలయ రికార్డులను పరిశీలించారు. విధులకు సమయానికి హాజరుకావాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శి ఎం.బాల కుమారి, సిబ్బంది ఉన్నారు.

షాపులకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-సీతంపేట

సీతంపేట మెయిన్ రోడ్డు పెట్రోల్ బంక్ ఎదురుగా జిసిసి ద్వారా నూతనంగా నిర్మించిన షాపులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఐటిడిఎ పిఒ కల్పనకుమారి ఒక ప్రకటన తెలిపారు. ఆసక్తి ఉన్న వారు డిపాజిట్ సొమ్ము ఏదైనా జాతీయ బ్యాంకులో జిసిసి డివిజనల్ మేనేజర్ పేరు మీద డిడి తీసుకొని, వారి కుల ధ్రువపత్రం, ఆధార్ కార్డు జతపరిచి మే 10వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

బీమా నగదు అందజేత

ప్రజాశక్తి-మక్కువ

మక్కువకు చెందిన ఓయిల సరస్వతి కుటుంబ సభ్యులకు గురువారం వైఎస్ఆర్ బీమా తక్షణ సాయం రూ.10 వేలను వైసిపి మండల నాయకులు మావుడి రంగునాయుడు అందజేశారు. ఇటీవల అనారోగ్య కారణాలతో సరస్వతి మృతి చెందింది. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు కె.శంకర్రావు, ఎ.శ్రీనివాసరావు, పి.కృష్ణ పాల్గొన్నారు.



బీమా నగదు అందిస్తున్న వైసిపి నాయకులు రంగునాయుడు

ఇంటర్‌లో మెరిసిన విద్యార్థులు

ప్రజాశక్తి-పాలకొండ

పట్టణంలో ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో మంచి ప్రతిభ కనబరిచారు. ఎంపిసి గ్రూపు నుంచి సవర జ్ఞానాసి 419 మార్కులు, బైపిసి గ్రూపులో ధనుంజయ్ 400 మార్కులు, హెచ్ఇసి గ్రూపులో బూరాడ అనూష 393 మార్కులు, ఒకేషనల్ కోర్సులో ఎన్.చంద్రకళ 413 మార్కులు, సిఎస్ గ్రూపు నుంచి ఆరిక సింగరాజు 459 మార్కులు, సిఇటి గ్రూపు నుంచి యశ్వంత్ 435 మార్కులు, ఎటి గ్రూపు నుంచి సవర సుమంత్ 452 మార్కులు సాధించారు. వీరిని కళాశాల ప్రిన్సిపల్ జగన్మోహనరావు, సిబ్బంది అభినందించారు.

కెజిబివి విద్యార్థిని ప్రతిభ

ప్రసన్నలక్ష్మి

కురుపాం : స్థానిక కెజిబివిలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం విద్యార్థిని ఎ.ప్రసన్నలక్ష్మి ఎంపిసిలో 450 మార్కులు సాధించినట్లు ప్రత్యేకాధికారి ఐ.కిరణ్ కుమారి తెలిపారు. ఈ సందర్భంగా ఆ విద్యార్థిని కళాశాల సిబ్బంది అభినందించారు.

జిజెసిలో ఉత్తమ ఫలితాలు

వీరఘట్టం : ఇంటర్మీడియట్ ఫలితాలలో ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారు. ఎంపిసిలో ఎస్.నందిని 949 మార్కులు సాధించినట్లు ప్రిన్సిపల్ పి.శంకర్రావు తెలిపారు. బైపిసిలో బి.గాయత్రి 902, సిఇసిలో కె.సాయిలక్ష్మి 912, ఒకేషనల్ గ్రూపులో బి.చైతన్య 957 మార్కులు సాధించారు.

విద్యార్థులకు పిఒ అభినందన

సీతంపేట : ఇంటర్ ఫలితాల్లో సీతంపేట ఐటిడిఎ పరిధిలోని గిరిజన విద్యార్థులు సత్తా చాటారు. దీనిలో భాగంగా ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను ఐటిడిఎ పిఒ కల్పనకుమారి గురువారం అభినందించారు. ఈ సందర్భంగా సిఒఇ కళాశాల విద్యార్థి సవర శంకరరావు ఎంపిసిలో 969 మార్కులు సాధించడంతో పిఒ సంతోషం వ్యక్తం చేశారు. బాలుర గురుకుల పాఠశాల విద్యార్థి ఒకేషనల్ కోర్సులో 981 మార్కులతో స్టేట్ ర్యాంక్ సాధించడం ఆనందంగా ఉందన్నారు. సీతంపేట బాలికల గురుకుల పాఠశాల విద్యార్థిని ఉలక శ్రీజ బైపిసిలో 953 మార్కులు, బాలుర గురుకుల పాఠశాల విద్యార్థి సవర ప్రేమ్ కుమార్ ఎంపిసిలో 963 మార్కులు, ఫస్ట్ఇయర్‌లో జన్ని కీర్తన 477 మార్కులు సాధించారు. వీరిని కూడా పిఒ అభినందించారు. ఇంటర్ ఫలితాల్లో ఫెయిల్ అయిన విద్యార్థులతో పిఒ మాట్లాడారు. ఫెయిల్ అవ్వడానికి గల కారణాలను విద్యార్థులను అడిగి తెలుసుకొన్నారు. నిరాశ చెందవద్దని, ఆత్మ విశ్వాసం కోల్పోకుండా, ధైర్యంగా ఉండాలని సూచించారు. సప్లిమెంటరీ పరీక్షలకు సన్నద్ధం అవడానికి కావాల్సిన ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డిడి బి.నగేష్, ఒఎస్‌డి (ఎడ్యుకేషన్) ఎం.యుగంధర్, ప్రిన్సిపల్స్ కె.విశ్వనాథం, పి.సూర్యకుమారి, ఐఐటి సూపర్ 60 కోర్స్ డైరెక్టర్ మురళిబాబు, గురుకులం సెల్ ఇన్‌ఛార్జి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

భాస్కర్ విద్యార్థులకు ఉత్తమ ఫలితాలు

పార్వతీపురం : భాస్కర్ జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్‌లో ఉత్తమ ఫలితాలు సాధించారు. జాగాన మోహన్‌రావు, సిహెచ్ మీనాక్షి ఎంపిసిలో 980 మార్కులు, వి.రేష్మ 979 మార్కులు, బైపిసిలో కె.వరలక్ష్మి 932 మార్కులు సాధించారు. ఫస్ట్ఇయర్‌లో ఎంపిసిలో గొట్టాపు సురేష్ 462 మార్కులు, బైపిసిలో కె.మౌనిక 398 మార్కులు సాధించారు. ఇంతటి ఘనవిజయం సాధించినందుకు భాస్కర్ విద్యాసంస్థల అధినేత చుక్క భాస్కరరావు ఆ కళాశాల అధ్యాపకులను, విద్యార్థులను, వారి తల్లిదండ్రులను అభినందించారు.

జె.మోహన్‌రావు

సిహెచ్ మీనాక్షి

గొట్టాపు సురేష్

కె.మౌనిక



సత్తాచాటిన విద్యార్థులను అభినందిస్తున్న కరస్పాండెంట్ మణికుమార్

వాసవి విద్యార్థుల విజయభేరి

పార్వతీపురం టౌన్ : ఇంటర్ ఫలితాలలో వాసవి కళాశాల విద్యార్థులు విజయభేరి మోగించారు. ఎంపిసిలో గెంబలి జగదీష్‌కు 464 మార్కులతో జిల్లా మొదటి స్థానం సాధించాడు. బైపిసి గ్రూపులో వి.మేఘన 415 మార్కులు సాధించింది. ద్వితీయ సంవత్సరం ఎంపిసిలో కె.బిందు 981, వై.అనిత 980, కె.ప్రవల్లిక 977, కె.సాయి మణికంఠ 976, వి.రేష్మ 974, మార్కులు సాధించారు బైపిసిలో డి.రత్నలతశ్రీ 969, జి.రోషిని 968, విటిఎస్ తాట్రాజ్ 964, సిహెచ్. స్వరూప్ 962, జె.బాగ్యశ్రీ 958, ఆర్.మేఘన 956 మార్కులు సాధించారు. వీరిని కరస్పాండెంట్ పివికె మణికుమార్ అభినందించారు.

సత్తాచాటిన ఆర్‌కె విద్యార్థులు

ఎం.హితశ్రీ

పార్వతీపురం : ఆర్‌కె జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో సత్తాచాటారు. ద్వితీయ ఇంటర్‌లో బైపిసిలో జిల్లా ఫస్ట్ సాధించామని కళాశాల డైరెక్టర్ పి.రామకృష్ణ తెలిపారు. సీతానగరం మండలం గుచ్చిమి గ్రామానికి చెందిన రైతు కుటుంబానికి చెందిన మరిశర్ల హితశ్రీ బైపిసిలో 982 మార్కులు సాధించింది. జి.సాయి భార్గవి ఎంపిసిలో 971 మార్కులు సాధించింది. ప్రథమ ఎంపిటిసిలో కె.కీర్తన 459, వెంకట సత్య సాయి 459, నాగేశ్వరి 459 మార్కులు సాధించారు. ఇంతటి ఘనవిజయం సాధించిన అధ్యాపకులకు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు కళాశాల డైరెక్టర్ రామకృష్ణ అభినందనలు తెలిపారు.

శ్రీగాయత్రి విజయకేతనం

మదన గోపాల్

వీరఘట్టం : శ్రీగాయత్రి కళాశాల విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో విజయకేతనం ఎగురవేశారు. ఎంపిసిలో ఎం.మదన గోపాల్ 975 మార్కులు, డి.పావని 967, ఎం.కల్పన 964, ఎం.బాబి 947 మార్కులు సాధించారు. బైపిసిలో వి.తనుజ 963, ఎల్.సుకన్య 946, ఎం.జ్యోత్స్న 930, ఎ.కావ్య, ఎస్.అనిత 924 మార్కులతో ఉత్తీర్ణత సాధించారు, ప్రథమ సంవత్సరం ఎంపిసిలో జి.శ్రుతి 463, కె.దీక్షిత 459, జి.చిన్నారి 456, వి.సాయి మేఘన 453, బైపిసిలో కె.జనని 410, అనిత 410 మార్కులు సాధించినట్లు ప్రిన్సిపల్ కె.సింహాచలం, కరస్పాండెంట్ ఎస్.లోకేష్ తెలిపారు.

ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందిస్తున్న శ్రీసత్యసాయి కళాశాల చైర్మన్ స్వాములు

శ్రీసత్యసాయి విద్యార్థులకు అభినందన

సాలూరు : ఇంటర్మీడియట్ ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన శ్రీసత్యసాయి జూనియర్ కళాశాల విద్యార్థులను కళాశాల చైర్మన్ డాక్టర్ కొల్లి స్వాములు అభినందించారు. గురువారం కళాశాలలో నిర్వహించిన అభినందన కార్యక్రమంలో చైర్మన్ డాక్టర్ కొల్లి స్వాములు టౌన్ ఫస్ట్, సెకెండ్ సాధించిన విద్యార్థులకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. ఇంటర్ సెకండియర్ ఫలితాల్లో ఎంపిసి, బైపిసి విభాగాల్లో పట్టణ ప్రథములుగా నిలిచిన సువ్వాడ భావన(974), వి.హైమావతి(969), ఫస్ట్ ఇయర్ ఫలితాల్లో ఎంపిసి విభాగంలో టౌన్ ఫస్ట్, సెకెండ్ సాధించిన ఎస్.ధనుంజయ (447), కె.శ్రావ్య (444), బైపిసి విభాగంలో టౌన్ ఫస్ట్ సాధించిన సిహెచ్.కార్తికేయ (426)లకు అభినందనలు తెలిపారు. కళాశాల డైరెక్టర్ కె.నాగమణి, ప్రిన్సిపల్ సిహెచ్.ప్రసాద్ కూడా అభినందించారు.

పథకాలకు అర్హతే ప్రామాణికం

పార్వతీపురంలో బైక్ ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే, వైసిపి నాయకులు

ప్రజాశక్తి-పాలకొండ రూరల్

సంక్షేమ పథకాలకు అర్హతే ప్రామాణికమని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ తెలిపారు. నగర పంచాయతీ పరిధి వివర్స్ కాలనీలో గురువారం మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని నాయకులు ఆకుల కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రతి ఇంటికీ వెళ్లి సిఎం జగన్మోహన్ రెడ్డి స్టిక్కర్ అంటించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన అభివృద్ధి ఫలాలు ఏ విధంగా అందుతున్నాయో అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో నగర పంచాయతీ వైస్ చైర్మన్ పల్లా ప్రతాపరావు, వైసిపి నాయకులు దవలేస్వరరావు, కోరాడ బాబు, కోరాడ ప్రసాద్, బోను మహంతి సోమశేఖర్, కడగల వెంకటరమణ, కోడెం విజయ్ కుమార్, మరియదాస్, ముద్దాడ చక్రవర్తి, కిల్లారి మోహన్రావు, బాసూరు కాంతారావు, దుప్పాడ పాపినాయుడు, కె.అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

పార్వతీపురం రూరల్ : పార్వతీపురంలో గురువారం జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమానికి మద్దతుగా ఎమ్మెల్యే అలజంగి జోగారావు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. బలిజిపేట, సీతానగరం, పార్వతీపురం అర్బన్ రూరల్ ప్రాంతాల నుంచి వందలాది మంది వైసిపి కార్యకర్తలు ద్విచక్ర వాహనాలతో తరలివచ్చి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుండి ప్రారంభమైన ఈ ర్యాలీ ప్రధాన రహదారి గుండా పాత బస్టాండ్, మున్సిపల్ కార్యాలయం, పాలకొండ రోడ్డు మీదుగా తిరిగి ప్రధాన రహదారి నుంచి పార్టీ కార్యాలయానికి చేరుకుంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని పార్టీ శ్రేణులు విజయవంతం చేయడంతో భారీ బైక్ ర్యాలీ నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైసిపి మూడు మండలాలు, పట్టణ అధ్యక్షులు బొంగు చిట్టి రాజు, పాలవలస మురళీకృష్ణ, బొమ్మి రమేష్, కొండపల్లి బాలకృష్ణ, జెడ్‌పిటిసి సభ్యులు అలజంగి రవికుమార్, మామిడి బాబ్జి, బలగ నాగేశ్వరరావు, వైస్ ఎంపిపిలు వి సాయిరాం, సిద్ధ జగన్నాథరావు, టి.సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న పీడీ పి.కిరణ్ కుమార్

వైకెపి సేవలపై అవగాహన

ప్రజాశక్తి - కురుపాం

వైఎస్ఆర్ క్రాంతి పథకం ద్వారా అందుతున్న సేవలపై విఒఎలకు అవగాహన ఉండాలని డిఆర్‌డిఎ పీడీ పి.కిరణ్ కుమార్ అన్నారు. గురువారం స్థానిక మండల సమైక్య కార్యాలయం వద్ద ఎపిఎం ఇ.వెంకట కిశోర్ ఆధ్వర్యంలో విఒఎల అవగాహన కార్యక్రమం ఏర్పాటుచేశారు. సంస్థాగత నిర్మాణం, స్త్రీ నిధి రుణాలు, ఉన్నతి రుణాలు, వైఎస్ఆర్ ఆసరా, చేయూత పథకాలు, తదితర వాటిపై వివరించారు. లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డిపిఎంలు ప్రవీణ్ కుమార్, అప్పారావు, ఎపిఎంలు జయమ్మ, భారతి, తదితరులు పాల్గొన్నారు.

రికార్డులను పరిశీలిస్తున్న మలేరియా నివారణ అధికారి శ్యామ్

మలేరియా నివారణకు ముందస్తు జాగ్రత్తలు

ప్రజాశక్తి - కురుపాం

మలేరియా నివారణకు ముందస్తు జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలని జిల్లా మలేరియా నివారణ అధికారి ఎ.శ్యామ్ అన్నారు. మండలంలో నీలకంఠాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం సాయంత్రం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బందితో ఆయన మాట్లాడుతూ వేసవిలో మలేరియా జ్వరాలు ఎక్కువగా వస్తాయన్నారు. దోమల నివారణకు పిచికారీ చేయించడం, మలేరియా నివారణకు ముందస్తు జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి అమర సింహారెడ్డి, వైద్య సిబ్బంది జి.శ్రీహరి రావు తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో హాల్ టిక్కెట్లు

ప్రజాశక్తి-మక్కువ

ఈ నెల 30న జరగనున్న ఏకలవ్య గిరిజన సంక్షేమ పాఠశాలకు సంబంధించిన ప్రవేశ పరీక్ష కోసం అభ్యర్థులు ఆధార్ నంబర్లతో నెట్ సెంటర్లో హాల్ టిక్కెట్లు పొందవచ్చని అనసభద్ర ఏకలవ్య పాఠశాల ప్రిన్సిపల్ ఎర్రు నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు.

అనారోగ్యంతో ఎల్ఐసి డిఒ మృతి

ప్రజాశక్తి-కలెక్టరేట్

ఎల్ఐసి పార్వతీపురం బ్రాంచ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ బి.కృష్ణ అనారోగ్యంతో మృతిచెందారు. అనారోగ్యంతో బాధపడుతూ గురువారం విశాఖలో ఆస్పత్రిలో మరణించారు. ఎల్ఐసి విశాఖపట్నం డివిజనల్ ఆఫీసర్ సిహెచ్.సుబ్బారావు దంపతులు రోడ్డు ప్రమాదంలో మరణించారు. వీరి మృతికి పార్వతీపురం ఎల్ఐసి బ్రాంచ్ మేనేజర్, ఉద్యోగులు, ఏజెంట్లు సంతాపం తెలిపారు.

గ్రామ వాలంటీర్లకు ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి-సీతంపేట

మండలంలో నాలుగు గ్రామ వాలంటీర్ల పోస్టులకు గురువారం ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ కె.సత్యం ఆధ్వర్యాన ఇంటర్వ్యూలు నిర్వహించారు. కుసిమి, చినపల్లంకి, కిరప, కిండంగిలో వాలంటీర్ పోస్టులు ఖాళీలుండగా మూడు దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. కార్యక్రమంలో ఎఒ మాస, జూనియర్ అసిస్టెంట్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పెద, చినపాపలకు పూజలు

ప్రజాశక్తి-వీరఘట్టం

వీరఘట్టంలోని పైడితల్లి అమ్మవారి గ్రామదేవత ఉత్సవాల్లో భాగంగా గురువారం పెద, చినపాపల వద్దకు మహిళలు చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పాఠశాలల్లో తల్లిదండ్రుల భాగస్వామ్యం

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

ప్రతి పాఠశాలలోనూ తల్లిదండ్రులను భాగస్వామ్యం కల్పిస్తే విద్యార్థుల అభివృద్ధిలో కూడా భాగస్వామ్యం అవుతారని సామాజిక తనిఖీ విభాగం స్టేట్ రిసార్స్ పర్సన్ కె.జనార్దనరావు తెలిపారు. శుక్రవారం స్థానిక గురుకుల బాలుర పాఠశాలలో మండలంలోని అన్ని యాజమాన్యాల పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో ఏర్పాటుచేసిన సామాజిక తనిఖీ శిక్షణలో ఆయన మాట్లాడారు. పాఠశాలలు, విద్యార్థులు అభివృద్ధి చెందాలంటే తల్లిదండ్రుల భాగస్వామ్యం కూడా తప్పనిసరి అన్నారు. పాఠశాలల్లో విద్యార్థుల ప్రగతి ఏ విధంగా ఉంది, ఉపాధ్యాయుల పనితీరు ఎలా ఉంది, బాల బాలికల హక్కులు తదితర వాటిని ప్రతి విద్యార్థి తల్లిదండ్రులు తెలుసుకుంటే ఉపయోగం ఉంటుందన్నారు. పాఠశాలలో విద్యార్థుల మధ్య లింగ బేదాభిప్రాయాలు లేకుండా సమానంగా చూడడం, సహ పాఠ్య కార్యక్రమాలలో విద్యార్థుల తల్లిదండ్రులను భాగస్వామ్యం కల్పిస్తూ ఉండాలని చెప్పారు. అనంతరం ఎంఇఒ జామి నారాయణస్వామి మాట్లాడుతూ ప్రతి ఉపాధ్యాయుడు బేస్ లైన్ సర్వేను ఈనెల 29 లోపు పొందుపరిచేలా ఉండాలన్నారు. శిక్షణలో ఎస్‌సి, ఎస్‌టి సంఘం నాయకులు పాలక దేవానంద్, తిక్క బాయి గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయులు జ్ఞాన ప్రకాష్, గిరిజన గురుకుల బాలుర పాఠశాల ప్రిన్సిపల్ వరప్రసాద్ బాబు, మేడిద గోవిందరావు, పలు ఉపాధ్యాయ సంఘం నాయకులు సంజీవరావు, ఆర్ఎస్ దుర్గారావు, పత్తిక ప్రసాదరావు, తదితరులు పాల్గొన్నారు.



సీతానగరం.. మాట్లాడుతున్న డిఇఒ వెంకటేశ్వరరావు

ఉపాధ్యాయులకు శిక్షణ

సీతానగరం : స్థానిక విద్యా వనరుల కేంద్రంలో గురువారం పాఠశాల ఉపాధ్యాయులకు సామాజిక తనిఖీపై శిక్షణ నిర్వహించారు. డిఇఒ పి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పాఠశాలలో జరుగుతున్న నాడు-నేడు పనులు, వివిధ అంశాల పైన కచ్చితంగా ఉండే విధంగా రికార్డులు అప్‌డేట్ లో ఉండాలన్నారు. తనిఖీలలో ఎటువంటి తప్పులు లేకుండా ఉండాలన్నారు. ప్రతి ఉపాధ్యాయులు తమ పాఠశాలలో జరిగిన పనులపై అన్ని వివరాలు ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌పి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సర్పంచ్‌ను సన్మానిస్తున్న గ్రామస్తులు

సర్పంచ్‌కు సన్మానం

ప్రజాశక్తి-బలిజిపేట

పెదపెంకి గ్రామంలో గాంధీ సెంటర్‌లో బుధవారం రాత్రి నేతాజీ గ్రంథాలయ స్థాపకులు ఈర్ల సంజీవ్‌నాయుడు ఆధ్వర్యంలో సర్పంచి నగిరి పాపారావును సన్మానించారు. పెదపెంకి ఉత్తమ పంచాయతీగా ఎంపికైన సందర్భంగా గ్రామస్తులు సన్మానించారు. అనంతరం సంజీవనాయుడు మాట్లాడుతూ గ్రామంలో వివిధ రకాల అభివృద్ధి పనులు చేపడుతూ, ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులకు అందిస్తూ ఉత్తమ పంచాయతీగా తీర్చిదిద్దారని సర్పంచి పాపారావును కొనియాడారు. కార్యక్రమంలో అప్పలనాయుడు మాస్టారు, సత్యంనాయుడు, అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించాలి

ప్రజాశక్తి-భామిని

మండలంలోని లివిరి, నేరడి, నల్లారాయిగూడ, బాలేరు సచివాలయాలను ఎంపిడిఒ జి.కృష్ణారావు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా సచివాలయ రికార్డులు, అందుతున్న సేవలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, లబ్ధిదారులు జాబితా, స్థానిక అంశాల పట్ల సచివాలయం సిబ్బంది అప్డేట్ గా ఉండాలని సూచించారు. సమయపాలన పాటిస్తూ, విధులు సక్రమంగా నిర్వర్తించాలని ఆదేశించారు. సచివాలయ సిబ్బంది అందిస్తున్న సేవల పట్ల ప్రజలకు అవగాహన ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శంకర్ రావు, లోవ అనసూయ ఉన్నారు.

రికార్డులను తనిఖీ చేస్తున్న ఎంపిడిఒ కృష్ణారావు